## రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

యాచారం, జూన్1: మండలంలో రేపటి నుంచి రెవెన్యూ సదస్సు కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తహసీల్దార్ అయ్యప్ప ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో మంగళవారం నుంచి రెవెన్యూ సదస్సులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. 3న మంతన్ గౌడ్, చౌదర్పల్లి, 4న మంతన్ గౌరెల్లి, నజ్దిక్ సింగారం, 5న మొండిగౌరెల్లి, తక్కళ్లపల్లి, 6న చింతపట్ల, మల్కీజ్ గూడ, 9న నల్లవెల్లి, తులేకుర్దు, 10న మాల్, కొత్తపల్లి, 11న గున్గల్, నందివనపర్తి, 12న గడ్డమల్లయ్యగూడ, అయ్యవారిగూడెం, 13న యాచారం, నక్కర్త, 16న మొగుళ్లవంపు, మేడిపల్లి, 17న తాడిపర్తి, నానక్ నగర్, 18న కుర్మిద్ద గ్రామాలలో రెవెన్యూ సదస్సులను నిర్వహించనున్నట్లు తెలిపారు. భూములకు సంబంధించిన సమస్యలను రెవెన్యూ సదస్సుల్లో పరిష్కరించుకోవాలని తహసీల్దార్ సూచించారు. అవకాశాన్ని రైతులు సద్విని చేసుకోవాలని కోరారు.

**మంచాల :** రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఈనెల 3నుంచి 20 తేదీ వరకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు మంచాల తహసీల్దార్ కేవీవీ ప్రసాద్ రావు ఆదివారం తెలిపారు. ఈనెల 3న చీదేడు, తిప్పాయిగూడ, 4న దాద్‌పల్లి, చిత్తాపూర్, 5న రంగాపూర్, తాళ్లపల్లి గూడ, 6న బోడకొండ, నల్ల చెరువు, 9న బోడకొండ, లింగంపల్లి, 10న జాపాల, సాబీత్‌నగర్, 11న అస్మత్‌పూర్, మనోహరాబాద్, 12న చాంద్‌ఖాన్ గూడ, నోముల, 13న లోయపల్లి, మల్లిఖార్జున గూడ, 16న శ్రీమంత్‌గూడ, మంచాల, 17న ఆరుట్ల, జెహినమ్మ గూడ, 18న ఆరుట్ల, ఆగపల్లి, 19న ఆరుట్ల, కాగజ్‌ఘట్, 20న బండలేమూరు గ్రామాల్లోని గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద సమావేశం నిర్వహిస్తున్నందున ఈ అవకాశాన్ని గ్రామ రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**కడ్తాల్ :** గ్రామాల్లో భూ సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ముంతాజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో రెవెన్యూ అధికారులు రెండు బృందాలుగా విడిపోయి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తారని ఆమె పేర్కొన్నారు. జూన్ 3న మక్తమాదారం, న్యామతాపూర్, 4న వాసుదేవ్‌పూర్, వంపుగూడ, 5న రావిచేడ్, చల్లంపల్లి, 9న చరికొండ, నాగిరెడ్డిగూడ, 10న సాలార్‌పూర్, ఏక్‌రాజ్‌గూడ, 11, 12వ తేదిల్లో ముద్విన్, టాక్‌రాజ్ గూడ, 13న కర్కల్‌పహాడ్, 16, 17 తేదిల్లో కడ్తాల్ గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వివరించారు. ఆయా గ్రామాల్లో నిర్వహించే రెవెన్యూ సదస్సులో ప్రజలు, రైతులు పాల్గొన్ని భూ సమస్యలను పరిష్కరించుకోవాలని ఆమె కోరారు.

## ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

షాద్‌నగర్‌రూరల్, జూన్ 1: తెలంగాణ ఉద్యమకారులకు గుర్తింపు కార్డులతో పాటు పలు సమస్యలను పరిష్కరించాలంటూ తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం చైర్మన్ వెంకట్రాంరెడ్డి, సమితి సభ్యులు ఆదివారం ఎమ్మెల్సీ కోదండరాంకు వినతి పత్రాన్ని అందజేశారు. ఎమ్మెల్సీని మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలను పరిష్కరించడంతో పాటు ఉద్యమకారులకు గుర్తింపు కార్డును అందజేయాలని కోరారు. అదేవిధంగా షాద్‌నగర్ పట్టణంలో తెలంగాణ అమరవీరుల స్థూపం, తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించేలా చూడాలంటూ, ఉద్యమకారుల కుటుంబాలకు రూ.10లక్షల ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలన్నారు. అదేవిధంగా తెలంగాణ ఉద్యమకారుల కోసం రాష్ట్ర స్థాయిలో కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. వినత పత్రం అందజేసిన వారిలో సమితి సభ్యులు శ్రీనివాస్, యాదయ్య, శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్, రాజు, బాలు నాయక్, నర్సింహులు, రవికుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

## విడుతల వారీగా ఇండ్ల కేటాయింపు

నందిగామ, జూన్ 1: మండలంలోని వెంకమ్మగూడ, చేగుర్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను మాజీ ఎంపీపీ ప్రియాంక శివశంకర్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల్లో అన్ని విధాలుగా సర్వే చేసి గ్రామసభలు పెట్టి ఇందిరమ్మ కమిటీలు, అధికారుల పర్యవేక్షణలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక నిష్పక్షపాతంగా పార్టీలకతీతంగా జరిగిందని, అర్హులైన పేదలకు విడుతల వారీగా ఇందిరమ్మ ఇళ్లను అందిస్తామని తెలిపారు.

**క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించిన ఎమ్మెల్యే**

చేగురు గ్రామంలో చేగూర్ ప్రీమియర్ లీగ్ సీజన్ 11 టోర్నమెంటును ఎమ్మెల్యే శంకర్, మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజేశ్వర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహ, మాజీ ఎంపీటీసీలు కృష్ణ చంద్రపాల్ రెడ్డి, కుమారస్వామిగౌడ్, మాజీ సర్పంచ్ కృష్ణ, రాజునాయక్, నాయకులు వీరేందర్‌గౌడ్, బుచ్చయ్య, శ్రీశైలం, వేణు, శివకుమార్, భాస్కర్‌గౌడ్, రవితేజ, వెంకట్ చారి, రాజశేఖర్, యాదయ్య, రవీందర్, లక్ష్మణ్, నరేష్, జగన్ పాల్గొన్నారు.

## రాష్ట్ర అవతరణ దినోత్సవానికి హాజరుకావాలి

కొత్తూరు, జూన్ 1: కొత్తూరు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగే తెలంగాణ అవతరణ దినోత్సవాలకు హాజరుకావాలని తహసీల్దార్ రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమంలో సోమవారం ఉదయం వేడుకలు నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు. ఈ వేడుకలకు ప్రజాపతినిధులు, అధికారులు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు.

**అవతరణ వేడుకలను జయప్రదం చేద్దాం**

కొందుర్గు, జూన్ 1 : కొందుర్గు మండలంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలను జయప్రదం చేద్దామని బీఆర్‌ఎస్ కొందుర్గు మండల అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని ముఖ్యకూడలిలో ఉదయం 9గంటలకు జాతీయ జెండా విష్కరణ కార్యక్రమం ఉంటుందని, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## కాంగ్రెస్ సర్కార్ హామీలను నెరవేర్చాలి

కడ్తాల్, జూన్ 1: రేవంత్‌రెడ్డి సర్కార్‌లో అన్నదాతలకు అన్ని విధాలా మోసం జరుగుతుందని బీఆర్‌ఎస్ కడ్తాల్ మండల ప్రధాన కార్యదర్శి చేగూరి మహేశ్ మండిపడ్డారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ సర్కార్ అమలు హామీలనిచ్చిందన్నారు. పంట పెట్టుబడి సాయాన్ని ఏడాదికి ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ పార్టీ, ఆ ఊసే లేదని విమర్శించారు. వానకాలం సీజన్‌లో ప్రతి రైతుకూ పంట పెట్టుబడి సాయాన్ని అందించాలని, లేని పక్షంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలను చేపడతామని ఆయన హెచ్చరించారు.

# నిధులున్నా.. పనులు సాగవు..

**గుంతల రోడ్లతో తప్పని ఇక్కట్లు..**

**అధ్వానంగా మారిన ఆగపల్లి, జాపాల రోడ్లు**

**విస్తరణ పనులు చేపట్టాలని వాహనదారుల విజ్ఞప్తి**



గతుకుల మయంగా ఉన్న జాపాల, ఆగపల్లి ప్రధాన రహదారి

మంచాల, జూన్ 1 : మండల పరిధిలోని ఆగపల్లి నుంచి జాపాలకు వచ్చే ప్రధాన రహదారి మొత్తం గుంతలమయంగా మారింది. దీంతో ఈ రోడ్డుపై ప్రయాణించే వాహనదారులు నిత్యం నరకయాతన పడుతూ ప్రయాణం చేయాల్సిన పరిస్థితి నెలకొన్నది. జాపాల నుంచి ఆగపల్లి వరకు 5కిలోమీటర్ల మేర రోడ్డు ఉంది. ఈరోడ్డు ఎటు చూసినా గుంతలతో పాటు కంకరతేలి అధ్వానంగా మారింది. దీంతో రోడ్డు మరమ్మత్తుల కోసం గత ప్రభుత్వం రూ.3కోట్ల 80లక్షలు కేటాయించినప్పటికీ పనులు మాత్రం ముందుకు సాగకపోవడంతో నిత్యం వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. రాత్రి సమయంలో ఈరోడ్డుపై ప్రయాణం చేయాలంటే వాహనదారులు జంకుతున్నారు. ఎక్కడ ఏ గుంత ఉందో తెలియక పోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అదేవిధంగా ప్రధాన రహదారి సింగిల్‌రోడ్డు కావడంతో పాటు రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్టు కొమ్మలు రోడ్లపైకి రావడంతో వాహనదారులు రోడ్డుతో పాటు రోడ్డుపైకి వచ్చిన చెట్ల కొమ్మలతో నిత్యం నరకాన్ని చూస్తున్నారు. జాపాల, రంగాపూర్, అస్మత్‌పూర్, చాంద్‌ఖాన్‌గూడ గ్రామాలకు చెందిన వారు వివిధ పనుల నిమిత్తం ఇబ్రహీంపట్నం, హైదరాబాద్‌కు నిత్యం వెళుతుంటారు. ఆగపల్లి నుంచి మంచాల వరకు రోడ్డు వెడల్పు కోసం గత ప్రభుత్వం రూ.3కోట్ల 80లక్షలు కేటాయించింది. కాగా, పనుల్లో జాప్యం జరుగడం వల్ల వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా అధికారులు ఈరోడ్డు పరిస్థితిని గుర్తించి రోడ్డు విస్తరణ పనులను వేగంగా పూర్తి చేయాలని కోరుతున్నారు.

**పనుల్లో నిర్లక్ష్యం తగదు..**



ఈరోడ్డు మొత్తం ఎక్కడ చూసినా గుంతలు ఏర్పడ్డాయి. రాత్రి, పగలు అనకుండా పనుల కోసం వెళుతూ ప్రమాదాల బారిన పడుతున్నాం. రోడ్డు బాగుకోసం గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిధులు కేటాయించినప్పటికీ అధికారులు పనులు చేయించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నిధులు ఉన్నా పనులు చేయకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం.

- ఎల్ల గణేష్, అస్మత్‌పూర్



గుంతల మయంగా మారిన ప్రధాన రహదారి

**రోడ్డును బాగు చేయండి..**



జాపాల నుంచి ఆగపల్లి వరకు ఉన్న గుంతల రోడ్డుతో రోజూ ఇబ్బందులు పడుతున్నాం. మోటర్ సైకిల్‌తో ఈరోడ్డు వెంట ప్రయాణించాలంటే ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఇబ్రహీంపట్నం వెళ్లాలంటే మా గ్రామానికి ఇదే ప్రధాన రహదారి కావడంతో పాటు దూరం తగ్గుతుందని అందుకే నిత్యం వందలాది మంది ఈరోడ్డు వెంటనే వెళుతున్నారు. ఈరోడ్డును బాగు చేసి వాహనదారులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని అధికారులను వేడుకుంటున్నాం.

- మల్లప్ప, జాపాల, ఉపసర్పంచ్

## సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



ఆమనగల్లు : పోలీస్‌స్టేషన్‌లో సీసీ కెమెరాలు అందజేస్తున్న దాత

ఆమనగల్లు, జూన్ 1: సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను నియంత్రించవచ్చని ఎస్ఐ వెంకటేష్ అన్నారు. మండల పరిధిలోని చెన్నంపల్లి పంచాయతీకి అదే గ్రామానికి చెందిన విక్రమ్‌రెడ్డి నాలుగు సీసీ కెమెరాలను పోలీసులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సీసీ కెమెరాల వల్ల భద్రతా ప్రమాణాలు మెరుగుపడతాయన్నారు. అలాగే రోడ్డు ప్రమాదాలు, దొంగతనాల నివారణకు వాహనాలను గుర్తించేందుకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. గ్రామంలోని ప్రధాన రహదారులు, బస్టాండ్ చౌరస్తాలో ఏర్పాటు చేస్తే నేరాలను అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జగన్, గ్రామ అధ్యక్షుడు రవికుమార్, రమణ, తిరుపతయ్య, విజేందర్, శ్రీధర్, జంతుక కృష్ణ, శ్రీకాంత్, మహేశ్ పాల్గొన్నారు.

**శాంతి భద్రతలను పరిరక్షించాలి**

మంచాల జూన్ 1: సీసీ కెమెరాల ఏర్పాటుతో శాంతి భద్రతల పరిరక్షణతో పాటు నేరాలను నియంత్రించడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు, మాజీ సహకార సంఘం చైర్మన్ సికిందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మంచాల మండలం లోయపల్లి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం రూ.50వేల నగదును మంచాల సీఐ మధుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోయపల్లిలో సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు గ్రామ అభివృద్ధి కూడా తన వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎల్లంకి పద్మ, విద్య శ్రీనివాస్‌గౌడ్, నరసింహగౌడ్, ధనంజయ, కర్ణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## మహాధర్నాను జయప్రదం చేయండి



షాద్‌నగర్‌టౌన్, జూన్ 1: కాళేశ్వరం కమిషన్ పేరుతో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌పై ప్రభుత్వం చేస్తున్న కుట్రలను నిరసిస్తూ ఈ నెల 4న హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద నిర్వహించనున్న మహాధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని షాద్‌నగర్ తాలుకా మాజీ కన్వీనర్ ముస్తఫా పిలుపునిచ్చారు. పట్టణంలో మహాధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆదివారం జాగృతి నాయకులతో కలిసి ఆవిష్కరించారు. కేసీఆర్ చేసిన అభివృద్ధి చూసి ఓర్వలేకనే కాళేశ్వరం కమిషన్ పేరుతో ప్రభుత్వం కుట్రలను పన్నుతూ కక్షపూరితంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. దీనిని నిరసిస్తూ తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో నిర్వహించే మహాధర్నా కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బాలాజీఉదయ్, సునీల్‌రెడ్డి, శ్రీకాంత్, శ్రీను, రాజేశ్, రమేశ్ పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేత



ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల రూరల్, జూన్ 1 : అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. ఆదివారం చేవెళ్ల మండల పరిధి ముడిమ్యాల్ గ్రామంలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం లబ్ధిదారులకు ఇండ్ల నిర్మాణ అర్హత పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు సత్యనారాయణ రెడ్డి, చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, ముడిమ్యాల్, చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్లు ప్రతాప్‌రెడ్డి, దేవర వెంకట్‌రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాండు, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాములు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్‌లు శైలజాఆగిరెడ్డి, ప్రభాకర్, జహంగీర్, రాంచంద్రయ్య, వెంకటేశంగుప్తా, మధుసూదన్‌గుప్తా, లావణ్యశంకర్, పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక నాయకులు పడాల రాములు, జనార్దన్ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



కేశంపేట, జూన్ 1: కేశంపేట మండల పరిధిలోని లేమామిడి గ్రామానికి చెందిన దిద్దెల నర్సింహ అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయాన్ని మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాలశ్రావణ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించి తక్షణ సహాయంగా బాధిత కుటుంబానికి గ్రామస్తుల ద్వారా ఆదివారం రూ.5వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు బి.వెంకటయ్య, ఆంజనేయులు, ప్రకాశ్, లక్ష్మయ్య, బాలాజీ పాల్గొన్నారు.

## ఘనంగా ఆత్మీయ సమ్మేళనం



ఆమనగల్లు, జూన్ 1: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత ప్రభుత్వ పాఠశాలలో చదివిన 2001–2002 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని విఠాయిపల్లి గ్రామ సమీపంలోని ఓ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి గురువులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. సమ్మేళనంలో నాటి గురువులు శివలింగం, చాంద్ పాషా, పూర్వ విద్యార్థులు మల్లేష్, రాజు, నిరంజన్, కృష్ణ, కిషోర్, శంకర్, వెంకటేష్, స్వాతి, బ్రహ్మాండ, చంద్రకళ, ఉమా, ఇందిరా పాల్గొన్నారు.

## ప్రాణదాతలుగా నిలవండి




అవయవదానం చేస్తానని పత్రాలు అందజేస్తున్న శ్రీనివాస్

కేశంపేట, జూన్ 1 : ప్రతి ఒక్కరూ అవయవదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని ఆల్ ఇండియా ఆర్గాన్ అండ్ బాడీ డోనర్స్ అసోసియేషన్ నేషన్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. కేశంపేట మండలం కాకునూరు గ్రామానికి చెందిన శ్రీనివాస్ అవయవదానానికి సంబంధించిన పత్రాలపై సంతకాలు చేసి సంస్థ నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన మరణం అనంతరం బాడీని వైద్య కళాశాలకు అప్పగించేలా ఒప్పందపత్రాలపై సంతకాలు చేశాడు. అవయవదానంవల్ల మనం జీవించి లేకపోయినప్పటికీ ఈ ప్రపంచాన్ని చూడగలమన్నారు. ప్రతి ఒక్కరూ మానవతాదృక్పథంతో అవయవదానం చేయాలని కోరారు.

## విద్యార్థులకు బహుమతులు అందజేత

ఇబ్రహీంపట్నం, జూన్ 1 : ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం మండలాలకు చెందిన పదో తరగతి, ఇంటర్ పరీక్షా ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ఇబ్రహీంపట్నం మండలం ఉప్పరిగూడ సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం 60 మంది విద్యార్థులకు మొదటి బహుమతి కింద ఒకొక్కరికీ రూ. 10000, రెండవ బహుమతి కింద 55 మంది విద్యార్థులకు రూ. 5,000 చొప్పున నగదు బహుమతి అందజేసి, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బూడిద రాంరెడ్డి, డీఆర్‌వో వెంకటాచారి, ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, ఉప్పరగూడెం మాజీ ఉపసర్పంచ్ నరసింహారెడ్డి, బీఆర్ఆర్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా రేడియల్ రోడ్లు..!

బండ్లగూడ, జూన్ 1: రేడియం రహదారులు ప్రమాదకరంగా మారుతున్నాయి. ఎంతో లక్ష్యంతో చేపట్టిన ఈ రోడ్ల నిర్మాణం అధికార నిర్లక్ష్యంతో ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి. ఎప్పటికప్పుడు రోడ్లను పర్యవేక్షించి తగు చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చూసిచూడనట్టు వదిలేయడంతో ప్రమాదాలకు దారి తీస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. టిప్పుఖాన్ పూల్ బ్రిడ్జి నుంచి ఔటర్ రింగ్ రోడ్డు వరకు ఉన్న రహదారి వెంట అనేక ప్రాంతా ల్లో రోడ్లు గుంతలు పడడంతో పాటు తవ్వకాలు చేపట్టి వదిలేశారు. దీంతో వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా ఉంటే ఎర్రకుంట వద్ద డివైడర్ కొట్టుకుపోయి గుంత ఏర్పడడంతో వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. వెంటనే అధికారులు చర్యలు తీసుకొని రేడియల్ రహదారులపై ఏర్పడిన గుంతలను పూడ్చడంతో పాటు ఎర్రగుంట వద్ద డివైడర్‌ను ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## చెరువులో పడి మహిళ గల్లంతు

ఇబ్రహీంపట్నం, జూన్ 1 : ప్రమాదవశాత్తు పెద్ద చెరువులో పడి మహిళ గల్లంతయిన ఘటన ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.... నగరంలోని ఫలక్నామ ప్రాంతానికి చెందిన రేష్మ(24) ఆదివారం సాయంత్రం పెద్ద చెరువు సమీపంలోకి వచ్చి ప్రమాదవశాత్తు జారిపడి గల్లంతయినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారు.

## కరాటే కిట్టు అందజేత

కొందుర్గు, జూన్ 1 : కొందుర్గు మాజీ ఉప సర్పంచ్ షుకుర్ ఆర్థిక సహాయంతో కరాటే విద్యార్థులకు ఆదివారం కిట్టును మాజీ వైస్ ఎంపీపీ రాజేశ్‌పటేల్ అందజేశారు. ఈ సందర్భంగా మాజీ వైస్ ఎంపీపీ మాట్లాడుతూ.. ఆత్మరక్షణ కోసం కరాటే అవసరమని, ప్రతి ఒక్కరూ చిన్నతనం నుంచే కరాటేను నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో మాస్టర్ రమేశ్, ఇస్తారయ్య, శివశంకర్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

## ట్రాక్టర్, ద్విచక్ర వాహనం ఢీ.. ఒకరి మృతి

ఆమనగల్లు, జూన్ 1: ట్రాక్టర్, ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఆమనగల్లు సమీపంలోని మూర్తుజాపల్లి గేట్ వద్ద హైదరాబాద్– శ్రీశైలం జాతీయ రహదారిపై ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై వెంకటేశ్ తెలిపిన వివరాల ప్రకారం నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం మారెడుమాన్‌దిన్నె గ్రామానికి చెందిన రాయకంటి కృష్ణయ్య (35) పెద్దకొత్తపల్లి మండల కేంద్రానికి చెందిన రొట్టె శేఖర్ ఇద్దరూ కలిసి ద్విచక్రవాహనంపై హైదరాబాద్ నుంచి పెద్దకొత్తపల్లి గ్రామానికి వెళ్తున్నారు. మార్గమధ్యంలో ఆమనగల్లు పట్టణ సమీపంలోని మూర్తుజాపల్లి గేట్ వద్దకు చేరుకునే సమయంలో ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాయకంటి కృష్ణయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. రొట్టె శేఖర్ తీవ్రంగా గాయపడినట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు. మృతుడికి భార్య కళావతి, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.



మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన 1994–95 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఈదులపల్లి లోని ఓ రిసార్ట్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాడు విద్యా బోధన చేసిన ఉపాధ్యాయులు రవీందర్‌రెడ్డి, ప్రహ్లాద్‌లను ఆహ్వానించి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

- నందిగామ, జూన్ 1

## పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



రాచులూరులో మాట్లాడుతున్న బాల్ రాజ్

కందుకూరు, జూన్ 1 : పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మండల సీఐటీయూ కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్ కోరారు. మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని రాచులూరు గ్రామంలో కార్మికుల సమస్యలు తెలుసుకున్న అనంతరం ఆయన మాట్లాడుతూ, గ్రామపంచాయతీ వర్కర్లకు మల్టీపర్పస్ విధానం పేరుతో ప్రతి ఒక్క వర్కర్ కు రూ 9,500 వేలు ప్రభుత్వం చెల్లిస్తుంది. కానీ అందులో నుండి రూ, 7 వేలు మాత్రమే అందుతున్నాయని తెలిపారు. మిగతా డబ్బులు మల్టీపర్పస్ లేని ఆరు సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికులకు చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. మండలంలోని చాలా గ్రామపంచాయతీలలో అధికారులు ఇదే విధానాన్ని కొనసాగిస్తున్నట్లు చెప్పారు. కొంతమంది వీధులు శుభ్రం చేసే స్వీపర్లకు 3,000 రూపాయలు మాత్రమే చెల్లిస్తున్నట్లు పేర్కొన్నారు. పంచాయతీ ఉద్యోగులకు చాలీ చాలని వేతనాలు ఇస్తూ వెట్టిచాకిరి చేయించుకుంటున్నట్లు వివరించారు.ఉదయం 7 గంటలకు మొదలుకొని సాయంత్రం 6 గంటల వరకు కారోబార్లను వారి వెంబడి పెట్టి ఎండల్లో, వానల్లో పనిచేయిస్తున్నారు. కానీ పనికితగిన వేతనం ఇవ్వడం లేదని విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి గుర్తింపు కార్డులను ఇవ్వాలని, ప్రతి కార్మికుడికి రూ .26 వేల వేతనం ఇవ్వాలని కోరారు. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, ప్రమాద బీమా పది లక్షల రూపాయలు ఇవ్వాలని, గ్రామపంచాయతీ వర్కర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ వర్కర్లు పాల్గొన్నారు.

## వివాహిత అదృశ్యం

యాచారం, జూన్1: కూలి పనికి వెళ్లిన ఓ వివాహిత అదృశ్యమైన ఘటన యాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని నల్లవెల్లి గ్రామంలో ఆదివారం చోటుచేసుకున్నది. సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపిన కథనం ప్రకారం.. మండలంలోని నల్లవెల్లి గ్రామానికి చెందిన దండుగుల శేఖర్‌తో 12 ఏళ్ల క్రితం మమత (29)కు వివాహం జరిగింది. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. గత నెల 30న కూలి పనికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయింది. మమత తిరిగి ఇంటికి రాలేదు. దీంతో శేఖర్ ఆమెకు ఫోన్ చేయగా స్విచ్చాఫ్ అయినట్లు గుర్తించాడు. కాగా, కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల ఇండ్లలో చుట్టుపక్కల గ్రామాల్లో వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో శేఖర్ ఆదివారం యాచారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## వృద్ధురాలి మెడలో బంగారం చోరీ



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ

ఇబ్రహీంపట్నం, జూన్ 1 : మంచాల మండల పరిధిలోని నోముల గ్రామానికి చెందిన లక్ష్మమ్మ ఆదివారం ఉదయం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని మంచాల రోడ్డులోని కూరగాయల మార్కెట్ నుంచి ఆర్టీసీ బస్టాండు వైపు నడుచుకుంటూ వెళుతున్నది. ఇది గమనించిన దుండగులు ఆమె మెడలో ఉన్న మూడు తులాల బంగారు గొలుసును అపహరించుకొని పారిపోయారు. వృద్ధురాలు ఇబ్రహీంపట్నం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నారు.

## రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ గోపాల్

కందుకూరు, జూన్ 1 :రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ గోపాల్ కోరారు. మూడో తేదీ నుంచి 20వ తేదీ వరకు రెవెన్యూ గ్రామాల వారీగా సదస్సులను నిర్వహిస్తామని చెప్పారు. రెండు బృందాలు ఏర్పాటు చేశామని వివరించారు. ఒక బృందానికి తనతో పాటు సీనియర్ అసిస్టెంట్ సురేందర్, ఆర్ఐ శ్రీకాంత్. సర్వేర్ శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ రాజశేఖర్, ఆపరేటర్ విజయ్ కుమార్, సత్యనారాయణ, శ్రీనివాస్ ఉంటారని, ఈ బృందం 3వ తేదీన బాచుపల్లి, 4న పెరుగుగూడ, 5న పులిమామిడి, 6న దన్నారం, 9న చిప్పలపల్లి, 10న మురళి నగర్, 11న జైత్వారం ఖాల్సా, 12న జైత్వారం మక్త, 13న కొత్తూరు, 16న గఫూర్‌నగర్,17న అక్బర్జ, 18న అలీ ఖాన్ పల్లి, 19న నేదంనూరు, 20న ముచ్చర్ల, 21న సార్ల రావులపల్లి గ్రామలలో నిర్వహిస్తారని, మరో బృందంలో నాయబ్ తహసీల్దార్ శేఖర్ ఆధ్వర్యంలో ఆర్ఐ యాదగిరి, సర్వేయర్ సాయి కాంత్, భరత్ రెడ్డి, ప్రశాంత్, రఘు ఈనెల 3వ తేదీ దెబ్బడగూడ, 4 వ తేదీ మహమ్మద్ నగర్, 5 అన్నోజిగూడ, 6న తిమ్మాయి పల్లి, 9న పంజగూడ, 10న మీర్‌ఖాన్ పేట్, 11న గుమ్మడవెల్లి, 12న మాదాపూర్, 13న తిమ్మాపూర్, 16న రాచులూరు,17న వేమూరు, 18న గూడూరు, 19 దాసర్లపల్లి, 20న కందుకూరు గ్రామాల్లో నిర్వహిస్తామని ఆయన తెలిపారు. సకాలంలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## శౌ చాలయాలకు తాళ ం..!




బండ్లగూడ, జూన్ 1 : బండ్లగూడ జాగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భా గంగా లక్షల రూపాయలు వెచ్చించి శౌ చాలయాలను ఏర్పాటు చేశారు. అయితే వాటి నిర్వహణను ఎవరూ పట్టించుకోకపోవడంతో ఎప్పుడు చూసినా తాళాలు వేసే ఉంటున్నాయి. దీంతో ప్రజలు అత్యవసర సమయాల్లో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే శౌచాలయాల తాళాలు తెరిచి వాటిని వినియోగంలోకి తేవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. అలాగే పలు ప్రాంతాల్లో వృథాగా పడిన శౌచాలయ డబ్బాలను తిరిగి వాడుకలోకి తీసుకురావాలని ప్రజ లు కోరుతున్నారు.